సాక్షి వరంగల్

గురువారం । 16 । మార్చి । 2023



విద్యార్థులే కొరియర్లు!

టాస్క్‌ఫోర్స్, మిల్స్‌కాలనీ పోలీసుల సంయుక్త దాడుల్లో విద్యార్థులు, యువకులు గంజాయి కొరియర్లుగా మారుతున్నారనే ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. - 8లో▸



ఏసీబీ వలలో డీఈఈ

మార్కెటింగ్ శాఖలో ఇన్‌చార్జ్ ఈఈగా పని చేస్తున్న డీఈఈ మహ్మద్ సిరాజ్ మొహియుద్దీన్ రూ.30వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$34^0/21^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మేఘాలు, సూర్యరశ్మితో కూడిన ఎండ ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'సంక్షోభంలో వ్యవసాయరంగం'



దుగ్గొండి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పాలకులు అవలంబిస్తున్న విధానాలతోనే వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతోందని తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ అన్నారు. వరంగల్‌లోని అబ్బనికుంట రైతు భవనం వద్ద ఈనెల 29న నిర్వహించనున్న వ్యవసాయ సదస్సును జయప్రదం చేయాలని ముద్రించిన పోస్టర్లను రైతు సంఘం నాయకులతో కలిసి ఆయన బుధవారం గిర్నిబావిలో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రపంచ వాణిజ్య సంస్థల ఆదేశాల మేరకు కేంద్రం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పాలన సాగిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యవసాయ ఆధారితంగానే 75 శాతం ప్రజలు జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే ఆ పరిశ్రమలు మూసివేతకు గురవుతున్న తరుణంలో కోట్లాది మంది రోడ్డున పడుతున్నారన్నారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి నిర్వహించే సదస్సుకు రైతులు, వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఓదెల రాజయ్య, రెముడాల దామోదర్‌రెడ్డి, జంగ జనార్దన్‌రెడ్డి, లడె మోహన్‌రావు, నల్ల విజయ్, చెన్నూరి అచ్చిరెడ్డి, ఇజ్జగిరి రాజన్న పాల్గొన్నారు.

ఆరుగురు ఎస్సైల బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆరుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్.వెంకటేశ్వర్లు వీఆర్ నుంచి వంగర పోలీస్‌స్టేషన్‌కు, ఎస్.మౌనిక వంగర నుంచి వీఆర్‌కు, ఎం.మహేందర్ మట్టెవాడ నుంచి ముల్కనూర్‌కు, ఏ.ప్రవీణ్‌కుమార్ ముల్కనూర్ నుంచి వీఆర్‌కు, బి.అనిత సుబేదారి నుంచి వీఆర్‌కు, ఎస్.జీనత్ జనగామ నుంచి వీఆర్‌కు బదిలీ చేశారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి..



సంగెం: పల్లెల్లోని నర్సరీల్లో పెంచుతున్న, పల్లె ప్రకృతి వనంలోని మొక్కలు వేసవి కాలంలో ఎండిపోకుండా నిరంతరం నీరందించాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. కుంటపల్లిలోని కంటి వెలుగు శిబిరం, నర్సరీ, పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణాలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నర్సరీల్లో ప్రస్తుతం ఎన్ని మొక్కలు పాతవి.. కొత్తగా ఎన్ని పెంచుతున్నారు.. ఏయే రకాలున్నాయో వాటి వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ఆయా రికార్డులన్నీ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. క్రీడా ప్రాంగణంలోని పిచ్చి మొక్కలను తొలగించి.. భూమిని చదును చేసి పిల్లలు, యువత ఆటలు ఆడుకునేందుకు సిద్ధం చేయాలన్నారు. కంటి వెలుగు శిబిరంలో పరీక్షలకు ప్రజలను ఎలా రప్పిస్తున్నారు.. వారికి ఎలాంటి పరీక్షలు చేస్తున్నారు.. కంటి అద్దాలను ఏ ప్రాతిపదికన పంపిణీ చేస్తున్నారు.. ఏయే దశల్లో టాబ్‌లో ఎంట్రీ చేస్తున్నారనే విషయాలను దగ్గరుండి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ కళావతి, సర్పంచ్ కావటి వెంకటయ్య, ఎంపీడీఓ కొమురయ్య, పంచాయతీ కార్యదర్శి వాజీద్, ఏపీఓ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



కాశిబుగ్గ సెంటర్: మధ్యాహ్న భోజన నిర్వహణపై వరంగల్ నరేంద్రనగర్‌లోని ప్రభుత్వ హైస్కూల్‌లో సామాజిక తనిఖీ జవాబుదారీతనం, పారదర్శకత సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ వాసంతి సామాజిక తనిఖీ బృందం సభ్యులతో కలిసి వంట గది పరిసర ప్రాంతాన్ని, భోజన ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వాసంతి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. వంటలు రుచికరంగా ఉండేలా చేయాలని సిబ్బందికి ఆమె సూచించారు.

సీపీ చేతిలో
'రైటర్ల' చిట్టా!



'గ్రేటర్' పరిధి ఉర్సు శివారులోని పది సర్వేనంబర్లలో మొత్తం 9 ఎకరాల 31 గుంటల్లో చేసిన లే అవుట్‌లో 2005లోనే 97మంది ప్లాట్లు కొనుగోలు చేశారు. 2019లో తాము రిజిస్ట్రేషన్ చేసుకున్నామంటూ కొంతమంది ఆయా ప్లాట్ల మీదకు రావడంతో విషయం సీపీ రంగనాథ్ దృష్టికి వెళ్లింది. వెంటనే సంబంధిత పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేసి అక్రమణదారులపై కేసు నమోదు చేశారు. వారు ఈసీతో సంబంధం లేకుండానే నకిలీ డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్లు పోలీస్ విచారణలో తేలినట్లుగా తెలిసింది.'

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో వీరిదే కీలకపాత్ర

- తెరపైకి నకిలీ భూ రిజిస్ట్రేషన్ల వ్యవహారం
- ఇప్పటికే రెవెన్యూ అధికారులతోనూ భేటీ
- లోతైన విశ్లేషణ చేస్తున్న ఏవీ రంగనాథ్

సాక్షి, వరంగల్: గ్రేటర్ వరంగల్ పరిధిలో జరుగుతున్న భూకబ్జాలు, నకిలీ రిజిస్ట్రేషన్ల వ్యవహారంపై వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ దృష్టి పెట్టారు. తాను బాధ్యతలు తీసుకున్న మూడు నెలల నుంచి ఎక్కువగా భూకబ్జాలు, నకిలీ భూపత్రాల వ్యవహారాలపై పెద్దమొత్తంలో ఫిర్యాదులు వస్తుండడంతో వీటి మూలాలను వెలికితీసే పనిలో నిమగ్నమయ్యారు. ఓ సర్వే నంబర్‌లో ఓపెన్ ప్లాట్ ఉంటే...మరో సర్వేనంబర్‌లోకి వచ్చి సదరు భూపత్రాలతో కబ్జా చేసి పొజిషన్లోకి వెళ్లడం, డబుల్ రిజిస్ట్రేషన్లు కావాలని చేసి.. అసలు యజమానులను ఇబ్బంది పెట్టడం...తదితర విషయాలను తీవ్రంగా పరిగణిస్తున్నారు.

ఇందులో భాగంగానే డబుల్ రిజిస్ట్రేషన్లు, నకిలీ రిజిస్ట్రేషన్ల వ్యవహారాల మూలాలను వెలికితీసే పనిలో ఉన్నారు. ఈ మేరకు హనుమకొండ, ఖిలావరంగల్, వరంగల్, నర్సంపేట, పరకాల, భీమదేవరపల్లి, స్టేషన్ ఘన్‌పూర్, జనగామ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లోని డాక్యుమెంటర్ రైటర్ల జాబితాను సీపీ తెప్పించుకున్నట్టు తెలిసింది.

రైటర్లు 'వాటా' మాట్లాడుకుని..

ఇప్పటికే సీపీ రంగనాథ్‌కు వస్తున్న భూ ఫిర్యాదుల్లో ఎక్కువగా నకిలీ డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లవే ఉన్నాయి. అసలైన భూ యజమాని నుంచి ఎవరెవరు ఎప్పుడు తీసుకున్నారు...రిజిస్ట్రేషన్ అయ్యిందనే వివరాలు ఎంక్యుంబెన్స్ సర్టిఫికెట్ (ఈసీ) చూస్తే డాక్యుమెంట్ రైటర్‌కు తెలిసిపోతుంది. ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు తొలుత డాక్యుమెంట్ రైటర్లను సంప్రదిస్తున్నారు. వీరు ఈసీ ఆధారంగా అన్ని చెక్ చేసి...లింక్ డాక్యుమెంట్లు అన్ని పర్‌ఫెక్ట్‌గా ఉంటేనే డాక్యుమెంట్ రెడీ చేయాలి. వీటికి తిలోదకాలిచ్చి చాలామంది వేలల్లో డబ్బులు తీసుకోవడంతో పాటు సంబంధిత సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులోని సిబ్బంది వాటా మాట్లాడుకొని రిజిస్ట్రేషన్లు చేస్తున్నారన్న విషయం పోలీసు విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది.

రైటర్ల కార్యకలాపాలపై నిఘా

సీపీ రంగనాథ్‌కు వచ్చిన ఫిర్యాదులపై చాలా మంది సబ్ రిజిస్ట్రార్‌లు, తహసీల్దార్‌లతోనూ నేరుగా మాట్లాడిన సందర్భాలున్నాయి. ఇందులో భాగంగానే నకిలీ రిజిస్ట్రేషన్‌కు మూలం కొందరు డాక్యుమెంట్ రైటర్లే అన్న విషయం బయటపడినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వరంగల్, ఖిలా వరంగల్, హనుమకొండ, నర్సంపేట సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల పరిధిలోని డాక్యుమెంట్ రైటర్ల చిట్టాను సేకరించిన పోలీసులు సీపీ రంగనాథ్‌కు అందించారు. వీరి కార్యకలాపాలపై నిఘా పెట్టారు. వారికి వచ్చిన ఫిర్యాదులను అనుసరించి ఈసీ చెక్ చేయకుండా ఎలా డాక్యుమెంట్ రెడీ చేస్తారంటూ ఇప్పటికే కొంతమందిని విచారించినట్టు తెలిసింది. సీపీకి వచ్చిన ఫిర్యాదులను ఆధారంగా చేసుకొని అవసరమైతే వీరిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉందని పోలీస్ వర్గాలు అంటున్నాయి. దీంతో ఆయా డాక్యుమెంట్ రైటర్ల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈ దెబ్బకు కొంతమంది డాక్యుమెంట్ రైటర్లు వృత్తికి దూరం కాగా... మరికొంత మంది ఈసీ పూర్తిగా చెక్ చేశాకే డాక్యుమెంట్ రెడీ చేస్తున్నారని తెలిసింది.

సొంతింటి కల.. తీరనున్న వ్యథ..!
గృహయోగం



గ్రేటర్ వరంగల్ దూపకుంట ఏరియాలో సా..గుతున్న ఇళ్ల నిర్మాణం

'డబుల్'పోను అర్హులకు ఇంటి నిర్మాణం

- 'గ్రేటర్' సహా ఉమ్మడి జిల్లాలో 'గృహలక్ష్మి'...
- అమలు కోసం మార్గదర్శకాలు
- లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేలు కీలకం.. అధికారులకు అందిన ఆదేశాలు
- నెలరోజుల్లోనే ఎంపిక ప్రక్రియ... కొత్త పథకంపై అర్హుల ఆశలు

సాక్షిప్రతినిధి, వరంగల్: అర్హులైన పేదల సొంతింటి కల నెరవేరనుంది. ఏళ్లుగా ఇల్లు లేదనే వ్యథ తీరనుంది. రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం పథకం పేదలకు అంతగా ప్రయోజనం కలిగించలేదు. ప్రభుత్వానికి ఆర్థికభారం పెరిగి ఎక్కడా ఆశించిన మేర సక్సెస్ కాలేదు. దీంతో పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం 'గృహలక్ష్మి' పథకం కింద రూ.3లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర మంత్రి మండలి ఇటీవల నిర్ణయించింది. ఈ స్కీం ద్వారా ఉమ్మడి వరంగల్‌లో మొదటి విడతగా 36వేల మందికి లబ్ధి చేకూరనుంది. నెలరోజుల్లో దరఖాస్తుల స్వీకరణ, అర్హుల ఎంపిక ప్రక్రియ పూర్తిచేసే దశలో ప్రభుత్వం అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది.

లక్ష్యం చేరని 'డబుల్' ఇళ్ల పథకం...

పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం 2015 సెప్టెంబర్‌లో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణానికి అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా మంజూరు ఇచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లు, కనీస వసతులకు కలిపి ఒక్కో దానికి రూ.6.29లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.6.05లక్షలు, జీడబ్ల్యూఎంసీలో జీప్లస్ త్రీకి రూ.7.75లక్షల చొప్పున కేటాయించారు. ఉమ్మడి వరంగల్‌లో ఈ పథకం కింద 60,568 మంది దరఖాస్తు చేసుకోగా మూడు విడతల్లో 25,916 ఇళ్లు మంజూరైనట్లు అప్పట్లో అధికారులు ప్రకటించారు. వీటి నిర్మాణం కోసం పలుమార్లు టెండర్లు నిర్వహించినా గిట్టుబాటు కావడం లేదనే ఉద్దేశంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఈ క్రమంలో అనేక చోట్ల నిర్మాణాలు నత్తనడకన సాగగా.. ఎమ్మెల్యేలు చొరవ చూపిన చోట కొంత మేరకు పూర్తయ్యాయి. 25,917 ఇళ్లు మంజూరైతే ఈ ఏడాది ఫిబ్రవరి 20 నాటికి 6,949 ఇళ్లు మాత్రమే పూర్తయినట్లు అధికారులు ప్రకటించారు. పూర్తయిన వాటిని కొన్నిచోట్ల లబ్ధిదారులకు కేటాయించగా, మరికొన్ని నియోజకవర్గాల్లో ఎంపిక జరుగుతోంది. ఇదే సమయంలో గృహలక్ష్మి పథకాన్ని ప్రభుత్వం అమల్లోకి తెస్తోంది.

'గృహలక్ష్మి'పైనే ఆశలు... నియోజకవర్గానికి 3వేలు...

సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి గృహలక్ష్మి పథకం కింద తొలి విడతలో ఒక్కో నియోజకవర్గానికి మూడు వేల ఇళ్ల చొప్పున ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాలకు 36 వేల ఇళ్లు ఇస్తారు. ఇందుకోసం సుమారు రూ.725కోట్లు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. వీటితోపాటు ఉమ్మడి జిల్లాకు 3,500 నుంచి 4 వేల ఇళ్ల వరకు రాష్ట్ర కోటానుంచి ప్రకృతి వైపరీత్యాలు ఇతరత్రా కారణాల కింద నష్టపోయిన వారికి అదనంగా మంజూరు చేసే అయ్యే అవకాశం ఉంది. ఈ ఇళ్ల కోసం లబ్ధిదారుల ఎంపికలో స్థానిక శాసనసభ్యులు, అధికార పార్టీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు కీలకంగా వ్యవహరిస్తారు. ఇళ్లను ఆ ఇంట్లోని గృహిణి పేరిటే మంజూరు చేస్తారు. నిర్మాణ ప్రక్రియకు అనుగుణంగా రూ.లక్ష చొప్పున మూడు దఫాలుగా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు. కాగా.. గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపికపై ఈ వారంలో హైదరాబాద్‌లో ఉన్నతస్థాయి సమావేశంపై సమాచారం వచ్చిందని, ఆ తర్వాత ప్రక్రియ ఉంటుందని ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ ఉన్నతాధికారి 'సాక్షి ప్రతినిధి'కి తెలిపారు.

ఫస్టియర్ పరీక్షలు షురూ..

- తొలిరోజు 775 మంది గైర్హాజరు

కాశిబుగ్గ సెంటర్: జిల్లాలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొత్తం 7,132 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు 27 కేంద్రాలను ఏర్పాటు చేశారు. తొలిరోజు 6,357 మంది పరీక్షకు హాజరుకాగా.. 775 మంది గైర్హాజరైనట్లు డీఐఈఓ కాక మాధవరావు తెలిపారు. జనరల్ విద్యార్థులు 5,407 మందికి.. 658 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సుల్లో 950 మందికి.. 117 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. అన్ని కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ఆయన తెలిపారు.

పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

గీసుకొండ: కొనాయమాకుల వద్ద గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ పి.ప్రావీణ్య బుధవారం సందర్శించారు. కేంద్రంలో విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరును ఆమె గమనించారు.



కొనాయమాకుల కేంద్రంలో పరీక్ష తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించిన కలెక్టర్

గీసుకొండ: కొమ్మాల గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ప్రావీణ్య బుధవారం సందర్శించారు. శిబిరంలో పరీక్షల తీరును పరిశీలించడంతోపాటు ఎందరికి పరీక్షలు చేశారు.. కళ్లద్దాలు ఎంత మందికి ఇచ్చారనే విషయాలను డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటరమణను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. కాగా.. కొమ్మాల హెల్త్ సబ్ సెంటర్‌లో మరుగుదొడ్డి, నీటి ట్యాపులు, కరెంటు సదుపాయం సరిగా లేదని, ప్రభుత్వ పాఠశాల వరండాలో బండలు వేయించాలని, గ్రామపంచాయతీ వారు సెస్ చెల్లించకపోవడంతో పుస్తక నిక్షిప్త కేంద్రం మూతపడి ఉందని పాఠశాల కోఆప్షన్ సభ్యుడు టి.బ్రహ్మచారి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి.. వివరించారు. మచ్చాపూర్–లక్ష్మీపురం రోడ్డు కంకరతేలి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ఎంపీపీ బీమగాని సౌజన్య కలెక్టర్‌ను కోరగా.. పరిశీలిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విశ్వనారాయణ, ఎంపీడీఓ వీరేశం, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.గోపాల్‌రావు, జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్.మాధవీలత, కంటి వెలుగు క్యాంపు అధికారి డాక్టర్ యశస్విని, సీహెచ్‌ఓ బి.మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ వీరాటి కవిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కొమ్మాలలో సర్పంచ్‌కు కంటి అద్దాలు ఇస్తున్న కలెక్టర్ ప్రావీణ్య. పక్కన డీఎంహెచ్‌ఓ

'పేట'కు చేరిన మాదిగల సంగ్రామ యాత్ర



నర్సంపేటకు చేరుకున్న పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

నర్సంపేట: కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై చేస్తున్న నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగల సంగ్రామ పాదయాత్ర బుధవారం ఆరో రోజుకు చేరింది. జిల్లా పాదయాత్ర బృందం సభ్యులు కట్ల రాజశేఖర్, జన్ను మధుకర్, ఇనుముల పూర్ణయ్య, జన్ను రవి, అబ్బదాసి దిలీప్, పర్లపెల్లి దీపక్‌లు చేపట్టిన యాత్ర నర్సంపేటకు చేరింది. ఈ సందర్భంగా యాత్ర బృందానికి మహాజన సోషలిస్టు పార్టీ నాయకులు డప్పుచప్పుళ్లు, మంగళహారతులతో స్వాగతం పలికారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పాదయాత్ర బృందం సభ్యులు పూలమాల వేసి ర్యాలీగా అమరవీరుల స్తూపం వరకు చేరుకున్నారు. అనంతరం మహాజన సోషలిస్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కల్లెపల్లి ప్రణయ్‌దీప్, డీబీబీపీఎస్ నాయకులు అందె రవి, ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు తడుగుల విజయ్, కట్ల రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేస్తామని తొమ్మిదేళ్లుగా మాయమాటలు చెపుతూ పబ్బం గడుపుతోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఊరూరా తెలియజేయడం కోసం పాదయాత్ర చేపట్టామన్నారు. ఈనెలలో ఎంఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఏప్రిల్ 4న హైదరాబాద్ నగరాన్ని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో దిగ్బంధించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 4లోపు వర్గీకరణపై పూర్తిస్థాయి సానుకూలమైన స్పష్టత ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్పీ నగర అధ్యక్షుడు మునిగె యాకుబ్, మాదాసి బాబు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు జలగం రమేశ్, లావణ్య, కొమ్మాలు, రాజుయాదవ్, విజయ్, రజిత, కవిత, కార్యకర్తలు పాల్గొన్నారు.

'పల్లె'కొచ్చిన జార్ఖండ్ ప్రతినిధులు



గంగదేవిపల్లిని సందర్శించిన జార్ఖండ్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

గీసుకొండ: జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని జార్ఖండ్ రాష్ట్రంలోని 15 స్వచ్ఛంద సంస్థలకు చెందిన ప్రతినిధులు బుధవారం సందర్శించారు. సంవాద్, టెక్నాలజీ రిసోర్స్ కమ్యూనికేషన్ అండ్ రిసోర్స్ సెంటర్, వేదిక్, కోకిత్, కిర్రా సొసైటీలు, మల్టీ ఆర్ట్ అసోసియేషన్, బికాస్ సంయోగ్ కేంద్ర్, సిరంజీవి మహిళా సమితి, మహిళా సమగ్ర ఉత్తీన్ సమితి, బదా లవ్ ఫౌండేషన్, హోప్ జార్ఖండ్, చేతన్ వికాస్, గ్రామీణ్ సమాజ్ వికాస్ మంచ్, సొసైటీ ఫర్ రిఫార్మేషన్ ఆఫ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ ఆదివాసీ స్వచ్ఛంద సంస్థల వారు 15 మంది గ్రామాభివృద్ధి తీరుతెన్నులను పరిశీలించారు. బాల వికాస ట్రైనింగ్ మేనేజర్ కొట్టె రమాదేవి ఆధ్వర్యంలో వారు సందర్శించగా.. జిల్లా ట్రైనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి, మేడిద సుశీల వారికి గ్రామం గురించి వివరించారు.

ఆయుష్ కిట్లు రాలే..

గీసుకొండ: వరంగల్, హనుమకొండ జిల్లాలోని ఎంపిక చేసిన ప్రభుత్వ బాలికల పాఠశాలలు, కేజీబీవీల్లోని టెన్త్ విద్యార్థినులకు బుధవారం నుంచి ఆయుష్ హెల్త్ కిట్లను పంపిణీ చేయాల్సి ఉంది. ఈ కార్యక్రమాన్ని మూడు రోజులపాటు చేపట్టడానికి ఆయుష్ అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే హైదరాబాద్ నుంచి కిట్లు, రాగి లడ్డూలు రాకపోవడంతో కార్యక్రమాన్ని ప్రారంభించలేదని, వచ్చిన వెంటనే ఒకటి రెండు రోజుల్లో ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. వారం రోజులపాటు కార్యక్రమాన్ని చేపట్టే అవకాశం ఉందని అంటున్నారు. తొలిరోజు సిద్దిపేట జిల్లాలో హెల్త్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.

కంటి వెలుగు శిబిరం సందర్శన



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు పరీక్షల శిబిరాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటరమణ బుధవారం సందర్శించారు. పరీక్షలు జరుగుతున్న తీరు, కళ్లద్దాల పంపిణీని పరిశీలించి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గోపాల్‌రావు, క్యాంపు వైద్యాధికారి శార్విన్, సీహెచ్‌ఓ మధుసూదన్‌రెడ్డి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ గణేశ్, శ్రీలత, ఏఎన్‌ఎంలు రోజా, కవిత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధులపై శిక్షణ

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో అసంక్రమిత వ్యాధుల నియంత్రణపై స్టాఫ్ నర్సులకు బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, అధికారులు పాల్గొన్నారు.

హక్కుల చట్టంపై అవగాహన పెంచుకోవాలి

వరంగల్ రూరల్: వినియోగదారుల హక్కుల చట్టంపై అవగాహన పెంచుకోవడంతోపాటు చైతన్యవంతులు కావాలని అదనపు కలెక్టర్ శ్రీవత్స కోట అన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వినియోగదారుల సమాచార హక్కుల అధికారి గౌరీశంకర్ ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారులను సాధికారికంగా శక్తివంతం చేయడం, క్లీన్ ఎనర్జీ ట్రాన్సిషన్స్ ఫుడ్ సేఫ్టీ, వినియోగదారుల హక్కులు, సంబంధిత అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీవత్స మాట్లాడుతూ వినియోగదారుడికి కల్పించిన హక్కులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వినియోగదారుల హక్కుల ప్రకారం ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు. హక్కుల చట్టాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ రతన్‌సింగ్, జిల్లా వినియోగదారుల సమాచార అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, ఉమ్మడి జిల్లా వినియోగదారుల కో ఆర్డినేటర్ కోడిమల శ్రీనివాస్, సామాజిక వేత్త దామోదర్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అమృత, విజిలెన్స్ సెక్రెటరీ ఈగ సత్యనారాయణ, జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



హక్కుల చట్టం ప్రతులను ఆవిష్కరించిన అదనపు కలెక్టర్ శ్రీవత్స

నీటి సరఫరా మానిటరింగ్ సెల్ ప్రారంభం

- చివరి ఇంటి వరకు నీరందిస్తాం..
- నగర మేయర్ గుండు సుధారాణి

వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మంచినీటి సరఫరాలో లోటుపాట్లను అధిగమించడానికి ఏర్పాటు చేసిన మానిటరింగ్ సెల్‌ను మేయర్ గుండు సుధారాణి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నగరంలో నీటి సరఫరా తీరును మెరుగుపరచడానికి, లోటుపాట్లను అధిగమించడానికి హైదరాబాద్ నుంచి ప్రత్యేక బృందం వచ్చి అధ్యయనం చేసినట్లు తెలిపారు. లోటుపాట్లు, ఇబ్బందులను గుర్తించిన నేపథ్యంలో చివరి ఇంటివరకు నీరందించాలన్న ఉద్దేశంతో గ్రేటర్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న టెయిల్‌ఎండ్ పాయింట్ ప్రాంతాలకు చెందిన సుమారు 700 గృహాల మొబైల్ నంబర్లను సేకరించినట్లు తెలిపారు. ఇకనుంచి వారికి కార్పొరేషన్ మానిటరింగ్ సెల్ సిబ్బంది ఫోన్‌చేసి నీటి సరఫరాలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకొని వెనువెంటనే పరిష్కరిస్తారన్నారు. అనంతరం నగరవ్యాప్తంగా ఉన్న వివిధ ప్రాంతాల టెయిల్‌ఎండ్ వాసులకు ఫోన్ చేసిన మేయర్ నీటి సరఫరా తీరు గురించి తెలుసుకున్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈ రాజయ్య, డీఈఈలు రవికుమార్, సంతోష్‌బాబు, నరేందర్, సారంగం పాల్గొన్నారు.



నగరంలోని చివరి ప్రాంతాల వారికి ఫోన్ చేసి తెలుసుకుంటున్న మేయర్ సుధారాణి

డ్రెయినేజీలో వ్యర్థాల తొలగింపునకు చర్యలు

కార్పొరేషన్ పరిధిలోని డ్రెయినేజీల్లో వ్యర్థాల తొలగింపునకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో ఆమె సమావేశమై పలు సూచనలు చేశారు.

హత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురి అరెస్ట్

ఖిలా వరంగల్: ఓవ్యక్తిపై దాడి చేసి కళ్లల్లో కారం నీళ్లు చల్లి, కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై సాంబయ్య, సుమన్, వినయ్‌కుమార్‌తో కలిసి ఇన్‌స్పెక్టర్ కేసు వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ 37వ డివిజన్ తూర్పు కోటకు చెందిన జెటబోయిన ఈశ్వర్, నవ్య దంపతులు కిరాణా దుకాణం నడుపుతూ జీవిస్తున్నారు. అతడి సమీప బంధువు జటబోయిన ఎల్లయ్య ఈనెల 7న మధ్యాహ్నం కిరాణం దుకాణానికి వెళ్లి సరుకులు తీసుకున్నాడు. 'చేతిలో డబ్బుల్లేవు ఫోన్‌పే ఉందా' అని ఈశ్వర్‌ను అడిగాడు. లేదు అనగానే ఆగ్రహానికి లోనైన ఎల్లయ్య ఈశ్వర్‌ను బూతులు తిట్టి వెళ్లాడు. అదే మనసులో పెట్టుకున్నాడు ఎల్లయ్య. అదే రోజు రాత్రి షాపు మూసి ఇంటికి వెళ్తున్న ఈశ్వర్ కళ్లల్లో ఎల్లయ్య కోడలు స్వర్ణలత కారం చల్లింది. అక్కడే మాటువేసిన ఎల్లయ్య, స్వర్ణలత ఇద్దరూ ఈశ్వర్‌ను గట్టిగా పట్టుకోగా.. ఎల్లయ్య కుమారుడు అరుణ్ పదునైన కత్తితో ఈశ్వర్ పొత్తి కడుపు, ఛాతిభాగంలో పొడిచాడు. గమనించిన ఈశ్వర్ తల్లిదండ్రులు రాజేశ్వరి, వెంకటేశ్వర్లు ఘటనా స్థలికి చేరుకోగా.. అక్కడి నుంచి అరుణ్, ఎల్లయ్య, స్వర్ణలత పారిపోయారు. రక్తపు మడుగులో ఉన్న ఈశ్వర్‌ను వరంగల్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. క్షతగాత్రుడి భార్య నవ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న ఎల్లయ్య, అరుణ్, స్వర్ణలతను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు.

ఆకతాయికి దేహశుద్ధి



ఆకతాయి(వృత్తంలో)ని పోలీసులకు అప్పగిస్తున్న స్థానికులు

వరంగల్: వరంగల్ తిలక్‌రోడ్‌లో గురువారం ఒక విద్యార్థిని ఓ ఆకతాయి అల్లరి పెట్టడంతో స్థానికులు దేహశుద్ధి చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వివేకానంద కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ ఎగ్జామ్ రాసి వస్తున్న సమయంలో తిలక్‌రోడ్‌లోని ఏ-వన్ కేక్ ఫ్యాక్టరీ సమీపంలో విద్యార్థిని చున్నీపట్టి లాగడంతో ఆమె కేకలు వేసింది. దీంతో అక్కడే ఉన్న స్థానికులు యువకున్ని పట్టుకొని దేహశుద్ధి చేసి 100 నంబర్‌కు డయల్ చేశారు. ఇంతే జార్‌గంజ్ పోలీసులకు అప్పగించారు. తిలక్‌రోడ్‌లో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని, వరసగా రెండు, మూడు బేకరీలు, ఎదురుగానే బార్ ఉండడంతో ఎప్పుడు బిజీగా ఉండడంతో పాటు ఈప్రాంతం ఆకతాయిలకు అడ్డాగా మారిందని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు ఈవీధిపై దృష్టి పెట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థులే కొరియర్లు!

- గంజాయి రవాణాలో కొత్తకోణం
- కొనుగోలుదారుల్లో ఉన్నత విద్యావంతులు
- వరంగల్ రైల్వేగేట్ ఏరియాలో యథేచ్ఛగా విక్రయాలు
- టాస్క్‌ఫోర్స్ దాడులతో వెలుగులోకి కేసులు..



గంజాయి రవాణా చేస్తూ ఏసీరెడ్డినగర్‌లో పట్టుబడిన ముగ్గురు నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయి, ఆటో (ఫైల్)

ఖిలా వరంగల్: గంజాయి రవాణాలో విద్యార్థులే కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఈజీ మనీ, జల్సాలకు అలవాటు పడి సరుకును చేరాల్సిన చోటుకు చేరుస్తున్నారు. ఇటీవల టాస్క్‌ఫోర్స్, మిల్స్‌కాలనీ పోలీసుల సంయుక్త దాడుల్లో విద్యార్థులు, యువకులు కొరియర్లుగా మారుతున్నారనే ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి.

విచ్చలవిడిగా విక్రయం

వరంగల్ నగరంలో గంజాయి వినియోగం ఒకప్పుడు గుట్టుగా సాగేది. ప్రస్తుతం బాగా పెరిగిపోయిందని ఇటీవల తరచూ గంజాయి రవాణా చేస్తూ పట్టుబడుతున్న అనేక ఘటనలు చెబుతున్నాయి. మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా వంటి చట్టవ్యతిరేక కార్యక్రమాల్లో యువత, విద్యార్థులే ఎక్కువగా ఉంటున్నారు. వీరు మత్తుకు బానిసగా మారుతున్నట్లు ఇటీవల టాస్క్‌ఫోర్స్ అధికారులు చేసిన సోదాల్లో బయటపడింది. వరంగల్ ట్రైసిటీ రహదారులపై బైక్ రేస్‌లు, పరస్పర దాడులు, పలువురు యువత వికృత చేష్టలను చూస్తే గంజాయి వినియోగం ఏ విధంగా మారిందో చెప్పవచ్చు. శివనగర్, ఏసీరెడ్డినగర్‌లో గుట్టుగా గంజాయి విక్రయాలు సాగుతున్నాయి. ఇక్కడ గంజాయి వ్యసనపరులు ఎక్కువగా ఉన్నారు. నిర్జన ప్రదేశాలల్లో అడ్డాలు ఏర్పాటు చేసుకుని గంజాయిని సిగరెట్లలో మార్చి 50 గ్రాముల గంజాయిని రూ.200ల నుంచి రూ.300ల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

రైల్వేగేట్ ఏరియాలో ..

గంజాయి, ఇతర మత్తు పదార్థాలు వరంగల్ తూర్పులో దొరకని ఏరియా లేదంటే అతిశయోక్తి కాదు. గతేడాది నుంచి నేటి వరకు వరంగల్ నగరంతో పాటు మిల్స్ కాలనీ, మామునూరు, మట్టెవాడ ఏరియాలో టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మిక దాడులు చేసి కేజీల కొద్ది ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసిన ఘటనలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ప్రధానంగా శివనగర్, ఏసీరెడ్డినగర్, కరీమాబాద్, శంభునిపేట, ఎస్ఆర్ఆర్‌తోట ప్రాంతాల్లో దాడులు చేసి వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్న ఘటనలు కోకొల్లలు. ఈప్రాంతాలకు చెందిన యువత, విద్యార్థులు గంజాయికి బానిసై ఆంధ్ర, ఒడిషా నుంచి కారు, బైక్‌లపై అత్యంత రహస్యంగా నగరానికి తెచ్చి విక్రయాలు సాగిస్తున్నట్లు ఇటీవల టాస్క్‌ఫోర్స్ దాడుల్లో బయటపడ్డాయి.

పట్టుబడిన కేసుల్లో మచ్చుకు కొన్ని..

- ఇటీవల శివనగర్‌లోని ఏసీరెడ్డి నగర్‌కు చెందిన సాయి, విక్కీ ఇద్దరు ఆంధ్ర, ఒడిషా నుంచి ఎండు గంజాయి తెప్పించి మరో ముగ్గురికి విక్రయించారు. ఆ ముగ్గురు గంజాయి సేవిస్తూ ఇతరులకు విక్రయిస్తూ ఇటీవల పట్టుబడ్డారు. వీరి నుంచి టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆటో, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.
- ఇటీవల మట్టెవాడ పరిధిలో ముగ్గురు విద్యార్థులు గంజాయి సేవిస్తూ, విక్రయిస్తూ టాస్క్‌ఫోర్స్ అధికారులకు పట్టుబడ్డారు. వారి నుంచి రెండు కిలోల ఎండు గంజాయి, మూడుఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.
- ఇటీవల వరంగల్ శివనగర్‌కు చెందిన ఓవిద్యార్థి గంజాయికి బానిసయ్యాడు. ఆవిద్యార్థి ఒడిషా కలిమెల నుంచి 3 కిలోల గంజాయిని బైక్‌పై తీసుకొచ్చి సేవిస్తూ విక్రయిస్తూ టాస్క్‌ఫోర్స్ అధికారులకు పట్టుబడ్డాడు. అతడి నుంచి 2 కేజీల ఎండు గంజాయి, ఫోన్, అపిల్ ఐపాడ్, బజాజ్ పల్సర్ బైక్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

చర్యలు తీసుకుంటున్నాం



పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలి. పాఠశాలలు, కళాశాలలపై నిఘా పెంచాం. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగుతులకు హాజరవుతున్నారా? ఇంకేమైనా అలవాట్లున్నాయా? అనే అంశాల్ని తల్లిదండ్రులు పరిశీలించాలి. ఆలస్యంగా ఇంటికి ఇస్తే వెంటనే నిలదీయాలి. గంజాయి విక్రయం, తరలింపును ఎవరైనా గుర్తిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం.

– ముస్క శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్, మిల్స్‌కాలనీ

అడవి అంటుకుంది



కనుకునూరు–పెగడపల్లి మధ్య కాలుతున్న అడవి

మహాముత్తారం: వేసవి సమీపిస్తున్న తరుణంలో ఆకు రాలుతున్న అడవులకు అగ్గి రాజుకుంటోంది. కిలోమీటర్ల మేర మంటలు అడవంతా వ్యాపిస్తున్నాయి. మండలంలోని కనుకునూరు నుంచి పెగడపల్లి వచ్చే ప్రధాన రహదారి వెంట మంటలు వ్యాపించడంతో వాహనాదారులు వేడి తట్టుకోలేక పోతున్నారు. ఈ మంటలు ఇలాగే కొనసాగితే మండలంలోని అడవంతా.. అంటుకునే అవకాశం ఉంది. దీంతో అడవిలోని చీడ పీడ పురుగులు, పాములు చనిపోయే అవకాశాలున్నాయి. అడవి జంతువులకు ప్రాణహాని ఉంది.

నేడు 'నిధి ఆప్కే నికత్'

హన్మకొండ అర్బన్: ఈపీఎఫ్ఓ సభ్యులు, యజమానులు, పెన్షనర్ల ఫిర్యాదులు, సమస్యల పరిష్కారానికి భూపాలపల్లిలోని కలెక్టరేట్ పక్కనే ఉన్న ఎల్లంద క్లబ్ హౌస్‌లో ఉదయం 11 గంటలకు నిధి ఆప్కే నికత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రీజినల్ పీఎఫ్ కమిషనర్ ప్రణీత్‌జోషి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్, జిల్లాలోని కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొనే ఈ కార్యక్రమంలో పీఎఫ్ సభ్యులు, యజమానులు, పెన్షనర్లు హాజరై వారి ఫిర్యాదులు పరిష్కరించుకోవాలని సూచించారు.

ఏసీబీ వలలో డీఈఈ

- లంచం తీసుకుంటుండగా డీఈఈ, ఇన్‌చార్జ్ ఈఈ పట్టివేత
- కంప్లీషన్ రిపోర్ట్ పంపేందుకు రూ.65 వేలు డిమాండ్
- రూ.30 వేల నగదు స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు

వరంగల్: వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లోని వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఈఈగా పని చేస్తున్న డీఈఈ మహ్మద్ సిరాజ్ మొహియుద్దీన్ రూ.30వేలు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు బుధవారం పట్టుకున్నారు. కార్యాలయ ఆవరణలో ఏసీబీ డీఎస్పీ కె.సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. సివిల్ కాంట్రాక్టర్ కోడెల వెంకట శైలేంద్రబాబుకు పరకాలలోని మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్, టాయిలెట్స్ బ్లాక్ నిర్మాణానికి సంబంధించి రూ.1.50 కోట్లలో సుమారు రూ.75లక్షలు బిల్లులు వచ్చాయి.



మహ్మద్ సిరాజ్ మొహియుద్దీన్, డీఈఈ

మిగిలిన డబ్బుల కోసం ఎస్టిమేట్లను ప్రభుత్వానికి పంపించేందుకు రూ.65 వేలు లంచంగా ఇవ్వాలని హనుమకొండ భవానినగర్ శ్రీనివాసకాలనీకి చెందిన మార్కెటింగ్‌శాఖ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఇన్‌చార్జ్ ఈఈ, డీఈఈ సిరాజ్ మొహియుద్దీన్ డిమాండ్ చేశారు. ప్రతిపాదనలు పంపాలని కార్యాలయం చుట్టూ తిరిగి వేసారిన బాధితుడు చివరకు రూ.60 వేలు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. డబ్బులు ఇవ్వందే ఎస్టిమేట్లు పంపించేది లేదని ఈఈ చెప్పడంతో బాధితుడు ఈనెల 5న ఏసీబీని ఆశ్రయించాడు. ఒప్పందం ప్రకారం.. రూ.60 వేలల్లో రూ.30వేలు బుధవారం ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అనంతరం లంచం తీసుకున్న డీఈఈ, ఇన్‌చార్జ్ మహ్మద్ సిరాజ్ మొహియుద్దీన్‌ను అరెస్ట్ చేసి మొదటి అడిషనల్ జడ్జి ఎదుట హాజరుపర్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపారు. ఈదాడుల్లో సీఐలు జె.శ్యాంసుందర్, కె.శ్రీను, ఎన్.రవితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టిమేట్ల కోసం ఇబ్బంది..



బిల్లులు పొందేందుకు కంప్లీషన్ రిపోర్టు హైదరాబాద్‌లోని మార్కెటింగ్‌శాఖ ఇంజనీరింగ్ విభాగానికి ప్రతిపాదనలు పంపాలని నాలుగు నెలలుగా కార్యాలయం చుట్టూ తిరిగాను. అయినా పట్టించుకోలేదు. రిపోర్టు పంపించేందుకు రూ.65 వేలు లంచం ఇస్తే చేస్తానని డీఈఈ, ఇన్‌చార్జ్ ఈఈగా ఉన్న మహ్మద్ సిరాజ్ మొహినుద్దీన్ చెప్పడంతో దిక్కులేని స్థితిలో ఏసీబీని ఆశ్రయించాను. రిపోర్ట్ పంపేందుకు మొదటి విడతగా రూ.30 వేలు ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

– కోడెల వెంకట శైలేంద్రబాబు, సివిల్ కాంట్రాక్టర్

15 గొర్రెల అపహరణ

దుగ్గొండి: మండలంలోని తొగర్రాయిలో బుధవారం గ్రామానికి చెందిన అన్న కుమారస్వామికి చెందిన 15 గొర్రెలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. కుమారస్వామి పొద్దంతా గొర్రెలను మేపుకుని వచ్చిన అనంతరం మంగళవారం రాత్రి వరంగల్–నర్సంపేట ప్రధాన రహదారి పక్కన మంద పెట్టాడు. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి దాటిన తర్వాత మందలోంచి 15 గొర్రెలను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

వలస కూలీ హత్య

- తోటి కూలీలే చంపి పరారైనట్లు అనుమానం
- నిందితుల కోసం గాలింపు



సూరజ్ మృతదేహం

హసన్‌పర్తి: బతుకుదెరువు కోసం వచ్చిన ఓ కూలీ హత్యకు గురయ్యాడు. హసన్‌పర్తి మండలం పెంబర్తి శివారులో జరిగిన ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కాశీశ్వరంలోని విద్యుత్‌శాఖలో ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌రావుకు పెంబర్తి శివారులో ఎకరం వ్యవసాయ భూమి ఉంది. ఈభూమి చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారు. ఈ పనులు కాజీపేటకు చెందిన ఎనగందుల బాబు అనే మేస్త్రీకి అప్పగించారు. వలస లేబర్‌తో మేస్త్రీ తక్కువ కూలీకి పనికి కుదుర్చుకున్నాడు. అందుకు కాజీపేట అడ్డా నుంచి సూరజ్(35)తో పాటు మరో ముగ్గురు కూలీలను తీసుకొచ్చాడు. ఈనెల 8న నలుగురు కూలీలు పెంబర్తికి వచ్చి పనులు మొదలుపెట్టారు. వరుసగా మూడ్రోజులు రాకపోకలు సాగించగా, అతర్వాత పని ప్రదేశంలో ఉంటూ పనులు చేస్తున్నారు.

పని ప్రదేశంలోనే హత్య..

బుధవారం ఉదయం సూరజ్ రక్తపు మడుగులో పడి మృతి చెంది ఉండగా, మరో ముగ్గురు కనిపించకుండా పోయారు. విషయం తెలుసుకున్న సదరు మేస్త్రీ బాబు వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మేస్త్రీని విచారించారు.

ముగ్గురిపై అనుమానం.. గాలింపు

తోటి కూలీలే సూరజ్‌ను హత్య చేసి పరారైనట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. మద్యం సేవించిన తర్వాత జరిగిన ఘర్షణలో ఇనుపరాడ్డుతో తలపై బాదడం వల్ల సూరజ్ మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. పరారైన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. హత్య జరిగిన ప్రదేశంలో జాగిలాలతో గాలింపు చేపట్టారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపారు.

ఫంక్షన్‌కు వెళ్లి తిరిగిరాని లోకాలకు..

- ట్రాక్టర్ బైక్ ఢీ.. ఒకరి మృతి



ఘటనాస్థలిలో ఉప్పస్వామి మృతదేహం



ఉప్పస్వామి (ఫైల్)

ఐనవోలు: బంధువుల ఇంటికి వెళ్లొస్తానని కానరాని లోకాలకు వెళ్లిపోయావా? అంటూ మృతుడి భార్య, బంధువులు విలపించిన తీరు అందరినీ కలచివేసింది. మండలంలోని రాంగనర్ గ్రామ శివారులో బుధవారం ఉదయం ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ఘటనలో వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన సాతుపెల్లి ఉప్పస్వామి(47) మృతి చెందాడు. ఉప్పస్వామి డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం నందనం గ్రామానికి తన బంధువుల ఇంటికి ఫంక్షన్‌కు వెళ్లాడు. తిరిగి బైక్‌పై బుధవారం ఉదయం స్వగ్రామానికి బయల్దేరాడు. రాంనగర్ శివారు మూలమలుపు వద్దకు చేరుకున్న క్రమంలో కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన ఆకుతోట యాకయ్య ట్రాక్టర్ ఎదురుగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఉప్పస్వామి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతో ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేటకు తరలించారు. మృతుడి భార్య పూలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై గుగులోతు వెంకన్న తెలిపారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య



శిరీష(ఫైల్)

మల్హర్: భర్త, అత్త, మామ వేధింపులు భరించలేక మనస్తాపంతో శిరీష(21) బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మండలంలోని కొయ్యూరు పీవీనగర్ చెందిన రవికుమార్‌తో శిరీషకు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక సంవత్సరం పాప ఉంది. శిరీష చుట్టు పక్కల వారితో మాట్లాడుతుంటే.. భర్త అనుమానంతో తరుచూ వేధించేవాడు. ఈక్రమంలో ఈనెల 12న కూడా శిరీషను అనుమానంతో రవి, అత్త, మామలు వేధించారు. దీంతో ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా ఆమె వెళ్లిపోయింది. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈనెల 14న మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం మరోసారి గ్రామస్తుల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టగా.. కొయ్యూరు నాగులమ్మ ఆలయ సమీప ఆవరణలో చెట్టుకు ఉరేసుకుని కనిపించింది. ఘటనా స్థలాన్ని తహసీల్దార్ శ్రీనివాస్, కాటారం సీఐ రంజిత్‌రావు పరిశీలించి, గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. శిరీష అన్న పెద్ది గంగారాజు ఫిర్యాదు మేరకు భర్త రవికుమార్, అత్త, మామలు మల్లీశ్వరి, రాజయ్యపై కేసు నమోదు చేసున్నట్లు కొయ్యూరు ఎస్సై నరేశ్ తెలిపారు.

విధుల్లో కుప్పకూలిన జీపీ వర్కర్

- గుండెపోటుతో మృతి



కట్టయ్య(ఫైల్)

గీసుకొండ: గ్రామంలోని చెత్తను ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న క్రమంలో గుండె పోటుతో గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్ బసికె కట్టయ్య(50) బుధవారం మృతి చెందాడు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కొమ్మాల గ్రామ పంచాయతీలో కట్టయ్య మల్టీపర్పస్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. ఉదయం 8.30 గంటల సమయంలో ట్రాక్టర్ నడుపుతూ.. చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలించే పనులు చేస్తున్నాడు. ట్రాక్టర్ నడుపుతుండగా.. గుండె పోటు రావడంతో దానిపైనే పడిపోయాడు. చికిత్స నిమిత్తం స్థానికులు అతడిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యలో మృతి చెందాడు. కట్టయ్య కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీఐటీయూ నాయకుడు బ్రహ్మచారి డిమాండ్ చేశారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి



ములుగు రూరల్(గోవిందరావుపేట): ఈతకు వెళ్లి కుంటలో పడి గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన పైడాకుల అక్షయ్‌కుమార్(15) బుధవారం మృతి చెందాడు. అక్షయ్ చల్వాయి మోడల్ స్కూల్ పదోతరగతి చదువుతున్నాడు. బుస్సాపూర్‌లో తన మిత్రులు అవినాశ్, దేవేందర్, అరవింద్‌తో కలిసి గ్రామ శివారులోని రాళ్ల మాటు కుంటలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. అక్షయ్‌కి ఈత రాక నీటిలో మునిగిపోయాడు. గమనించిన మిత్రులు అటుగా వెళ్తున్న బాటసారుల సాయంతో అక్షయ్‌కుమార్‌ను కాపాడేందుకు యత్నించినా ఫలితం లేకుండా పోయింది. అప్పటికే అక్షయ్‌కుమార్ మృతి చెందాడు. మృతుడి తండ్రి మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పస్రా ఏఎస్సై నరోత్తంరెడ్డి తెలిపారు.

పరీక్ష సరిగ్గా రాయలేదని.. ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



విద్యార్థిని నాగ జ్యోతి మృతదేహం

వరంగల్ క్రైం: పరీక్ష సరిగ్గా రాయలేదని ఇంటర్మీడియట్ ఫస్టియర్ విద్యార్థిని కాలేజీ హాస్టల్‌లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన బుధవారం సాయంత్రం హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నక్కలగుట్టలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడునూతల గ్రామానికి చెందిన విద్యార్థిని మురారిశెట్టి నాగజ్యోతి (16) హనుమకొండ నక్కలగుట్టలోని సువిద్య జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీ ఫస్టియర్ చదువుతోంది. బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభంకాగా, మొదటి రోజు పరీక్ష రాసి వచ్చింది. ఈ క్రమంలో సాయంత్రం హాస్టల్ స్టడీ అవర్ టీ బ్రేక్‌లో గదికి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. హాస్టల్ వార్డెన్లు చూసి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. విద్యార్థిని ఆత్మహత్యపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని, కేసు నమోదు కాలేదని సుబేదారి ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు. పరీక్ష సరిగ్గా రాయలేదని ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు.

పేకాడుతున్న మాజీ కార్పొరేటర్, రిటైర్డ్ ఏఎస్సై అరెస్ట్

- రూ.12 వేలు స్వాధీనం
- వాహనాలు, మొబైల్స్ సీజ్

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధి యాదవనగర్ ప్రాంతంలో ఓ పేకాట కేంద్రంపై బుధవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు జరిపింది. ఇందులో పేకాడుతున్న హనుమకొండ యాదవనగర్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ కుసుమ లక్ష్మీనారాయణ, యాదవనగర్ కృష్ణకాలనీకి చెందిన రిటైర్డ్ ఏఎస్సై తాటికొండ లక్ష్మీనారాయణ, రెడ్డికాలనీకి చెందిన ఇజ్జిగిరి శంకర్, తోట అశోక్, జవహర్ కాలనీకి చెందిన చెరుకు శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.12వేలు నగదు, కారు, బైక్‌తో పాటు ఐదు మొబైల్స్ సీజ్ చేశారు.

రైళ్ల రద్దు పొడిగింపు

- ఈనెల 19 నుంచి 21 వరకు

కాజీపేట రూరల్: కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని గంగినేని–ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ల మధ్య జరుగుతున్న మూడో రైల్వే నిర్మాణ పనుల కారణంగా రద్దు అయిన రైళ్లను ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు పొడిగించినట్లు బుధవారం రాత్రి రైల్వే అధికారులు తెలిపారు.

రద్దయిన రైళ్లు ఇవే..

ఈనెల 19న మచిలీపట్నం–సికింద్రాబాద్ (07185) ప్రతీ ఆదివారం వెళ్లే ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–మచిలీపట్నం (07186) ప్రతీ ఆదివారం వెళ్లే ఎక్స్‌ప్రెస్, డోర్నకల్–విజయవాడ (07755) రోజూ వెళ్లే ప్యాసింజర్, విజయవాడ–డోర్నకల్ (07756) వెళ్లే ప్యాసింజర్, విజయవాడ–భద్రాచలం రోడ్ (07979) వెళ్లే డైలీ సింగరేణి, భద్రాచలంరోడ్–విజయవాడ (07278) వెళ్లే సింగరేణి, ఈనెల 21న కాజీపేట–తిరుపతి (07091) ప్రతీ మంగళవారం వెళ్లే ఎక్స్‌ప్రెస్, తిరుపతి–కాజీపేట (07092) ప్రతీ మంగళవారం వెళ్లే ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

దూరం తగ్గించిన రైళ్లు ఇవే..

ఈనెల 19 నుంచి 23 వరకు గుంటూరు–సికింద్రాబాద్ (17201) వెళ్లే ఎక్స్‌ప్రెస్ గుంటూరు–కాజీపేట మధ్య, సికింద్రాబాద్–గుంటూరు (17202) వెళ్లే ఎక్స్‌ప్రెస్ కాజీపేట–గుంటూరు మధ్య రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించి ఉత్తర్వులు జారీ చేసినట్లు కాజీపేట రైల్వే అధికారులు తెలిపారు.

దారి మళ్లింపు, రీషెడ్యూల్

కాజీపేట జంక్షన్ మీదుగా విజయవాడ, బల్లార్షా, సికింద్రాబాద్ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను దారి మళ్లిస్తూ, రీషెడ్యూల్ చేసి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు.

